క్లుప్తంగా

దివ్యాంగులకు అండగా ఉంటాం



దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులను అందజేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం: దివ్యాంగులకు అండగా ఉంటామని, అర్హులైన వారికి పింఛన్లు, ఉచిత బస్సు పాసులు, ఇతర సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన 40 మంది దివ్యాంగులకు మంగళవారం బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉచిత బస్సు పాసులను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దివ్యాంగులు ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల యాదగిరిరెడ్డి, మాదం జంగయ్య, ఆర్టీసీ హైదరాబాద్ డిపోకు చెందిన అధికారి నాయిని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను ఆదుకుంటాం



చికిత్స పొందుతున్న మహిళలను పరామర్శిస్తున్న అభిషేక్‌రెడ్డి తదితరులు

యాచారం: సాగర్‌రోడ్డుపై సోమవారం రాత్రి ప్రమాదానికి గురైన నందివనపర్తి గ్రామానికి చెందిన క్షతగాత్రులను ఆదుకుంటామని కాంగ్రెస్ నేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పత్తి తీత కూలీలను మంగళవారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి గాయాలైన మహిళ కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అత్యవసరంగా ఉంటే నగరంలోని ప్రముఖ ఆస్పత్రికి తరలించాలని వైద్యులకు సూచించారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరు



లోయపల్లిలో డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచాల: డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని లోయపల్లి గ్రామంలో మంగళవారం ఆ సంఘం నేతలు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత 44 ఏళ్లుగా యువజన సంఘం విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. త్యాగాలకు తెగించి అనేక ఉద్యమాలు చేసిన ఘనత డీవైఎఫ్ఐది అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బావికాడి శంకర్, డీవైఎఫ్ఐ గ్రామ శాఖ కార్యదర్శి ఊరిపక్క లింగం, అధ్యక్షుడు పుల్యామల శ్రీకాంత్, నాయకులు వెంకటయ్య, రాజు, మహేశ్, కిరణ్, జంగయ్య, రవి, చాంద్ పాష, లక్ష్మణ్, సాయి, నవీన్, రాకేష్, నాగరాజు, శివ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితి ప్రత్యేక పూజలు



ఆమనగల్లు: మండలంలోని మంగళపల్లి గ్రామం హనుమాన్ దేవాలయంలో కార్తీక మాసం నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు నాగభూషణస్వామి, శరత్చంద్ర స్వాముల ఆధ్వర్యంలో నాగదేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కోహ్లి జన్మదిన వేడుకలు



కేకు కట్ చేస్తున్న కోహ్లి అభిమానులు

ఆమనగల్లు: టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి జన్మదిన వేడుకలను ఆమనగల్లు పట్టణంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కూడలిలో కేకు కోశారు. అనంతరం ప్రజలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోహ్లి అభిమానులు కలీం, ప్రవీణ్, అరుణ్, రంజిత్, మహేశ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: కుమ్మరికుంటలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



తుర్కయంజాల్: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు త్వరలో మరిన్ని నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సుమారు రూ.8.9 కోట్లతో అభివృద్ధి పనులకు మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, కౌన్సిలర్లతో కలిసి ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నెలకొన్న అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి లైట్లు, ఇంటింటికీ మంచినీటి సమస్యల పరిష్కారానికి త్వరలో నిధులను కేటాయిస్తామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ మంగజగదీశ్వర్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, కౌన్సిలర్లు రమేశ్, భానుగౌడ్, మమత, సునీత, శంకరయ్య, సుల్తానాబేగం, బాల్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కప్పరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేశ్‌గౌడ్, చందు, రాజు, రవి, సీహెచ్.రమేశ్, రాములు, సోమేశ్, శశిదరప్ప, కుమార్, యాదయ్య, కేవీ.రమేశ్‌రాజు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

తుర్కయంజాల్: మున్సిపాలిటీలో రూ.కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడలో సాగర్ రహదారి నుంచి వైట్ ఫీల్డ్ వెంచర్ వరకు టీజీఐఐసీ నిధులు రూ.2.20 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానికంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్ మాధవిమహేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు మంచాలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి

మంచాల: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ బాలశంకర్ తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి సీహెచ్.కృష్ణారెడ్డి వస్తుండడంతో మండలంలోని గ్రామాల్లో మంగళవారం నియోజకవర్గ ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటప్రసాద్, ఎంపీడీఓ బాలశంకర్ పర్యటించారు. గ్రామాల్లో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగేలా ముందస్తు చర్యలు తీసుకున్నారు. బుధవారం ఉదయం ఆరుట్లలో సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రారంభోత్సవం, అనంతరం బోడకొండ, లోయపల్లి, మంచాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించే సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



గట్టుఇప్పలపల్లిలో దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

- జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్
- మండల సాధనకు కొనసాగుతున్న నిరాహార దీక్ష

తలకొండపల్లి: ఉద్యమాన్ని ఉధృతం చేసి మండలాన్ని సాధించుకుంటామని జేఏసీ చైర్మన్ మొక్కరాల అశోక్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మండలానికి కావాల్సిన అన్ని అర్హతలు గట్టుఇప్పలపల్లికి ఉన్నాయని, అయినా మండలంగా ఎందుకు ప్రకటించడం లేదో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గట్టుఇప్పలపల్లిలో ఆ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్, పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల ఏర్పాటుకు పోరాడే దిశగా ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు అనిల్, తరుణ్, టీక్యా, లక్య, భీముడు, శ్రీను, గోపాల్, బాలు, హరిలాల్, శంకర్, భక్య, ఆంజనేయులుగౌడ్, రాజు, కృష్ణాజీ, బాలయ్య, మాణిక్యరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేయండి

తహసీల్దార్ నాగార్జున



మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

తలకొండపల్లి: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీకాంత్ సూచించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. మండలంలో 12,262 ఇళ్లను సందర్శించి సర్వే చేయాలన్నారు. ఈ నెల 6 నుంచి సర్వేను ప్రారంభించాలని చెప్పారు. ఈ నెల 7, 8 తేదీల్లో ప్రతి ఇంటికి సర్వే స్టిక్కరును అందజేస్తామన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న సర్వేలో పది ఇళ్లకు ఒక్కరు చొప్పున 107 మంది ఎన్యూమరేటర్లను, 10 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి కులం, ఆదాయం, రాజకీయ తదితర వివరాలతో కూడిన 54 అంశాల ఫారాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు.

నాయీ బ్రాహ్మణ సంఘానికి స్థలం ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

మంచాల: నాయీ బ్రాహ్మణ సంఘానికి మండల కార్యాలయ నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులు ప్రధానంగా కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యేక భవనానికి స్థలం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కోశాధికారి బాలరాజు, నాయకులు పరమేష్, రమేష్, సురేష్, సంతోష్, నర్సింహ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వైస్ చైర్మన్‌కు సన్మానం

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వైస్ చైర్మన్‌గా కాకి అమృతమ్మ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జినుకుంట్ల భాస్కర్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాసాచారి, కాకి కృష్ణ, ఆలయ పూజారి నర్సింహ, పవన్, శ్రీశైలం, రాజు, దేవేందర్, వెంకటయ్య, ప్రవీణ్, పర్వతాలు పాల్గొన్నారు.



వేం నరేందర్‌రెడ్డికి సన్మానం



తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని స్థానిక నేతలు సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్ మంగళవారం వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా పడి డ్రైవర్ మృతి

నాగోలు: ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ వివరాల ప్రకారం.. బిహార్ ప్రాంతానికి చెందిన అరుణ్ రాయ్(31) హయత్‌నగర్ మండల పరిధి పసుమాములలోని ఆల్ రిచ్ డైరీ సంస్థలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో సంస్థ నుంచి టీఎస్ 11యూజీ 5476 అశోక్ లీల్యాండ్ వాహనంలో పాల ప్యాకెట్ల లోడ్ తీసుకొని వస్తుండగా వెంకట్‌రెడ్డి నగర్ కాలనీ రోడ్ నెంబర్-4 వద్ద దిగువ ప్రాంతంలో వాహనాన్ని నిలిపి వెనుక టైర్ కింద రాయి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఒక్కసారిగా వాహనం ముందుకు వెళ్లడంతో ఆపే ప్రయత్నంలో వాహనం వెనక పరిగెత్తుతుండగా పక్కనే ఉన్న షట్టర్‌కు ఢీకొని ఒక్కసారిగా అరుణ్ రాయ్‌పై బోల్తా పడింది. స్థానికులు గమనించి అరుణ్‌రాయ్‌ని బయటకి తీసి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

యాచారం వాసికి డాక్టరేట్



కుమార్

యాచారం: మండల కేంద్రానికి చెందిన కేశమోని కుమార్‌కు కేఎల్ యూనివర్సిటీ మంగళవారం పీహెచ్‌డీ అందించింది. కోవిడ్-19 నిర్ధారణ పరిశోధనలో వెబ్ అప్లికేషనను రూపొందించినందుకుగాను ఈ డాక్టరేట్ అందుకున్నారు. 'ఇంటిగ్రేటివ్ సీఎన్ఎస్ బేస్డ్ మల్టీ మొడాలిటీ డయాగ్నోసిస్ సిస్టం ఫర్ కోవిడ్-19 డిటెక్షన్ యూజింగ్ ఈసీజీ, ఎక్స్రే, సీటీ స్కాన్ ఇమేజెస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ఈసీఈ విభాగాధిపతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.కోటేశ్వరరావు, ప్రొఫెసర్ సుబ్బారావు సారథ్యంలో ఈ పరిశోధన చేశారు. తనకు ప్రోత్సహించిన వారికి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యం

నాగోలు: ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. సాయినగర్ గుడిసెల్లో ఉంటున్న మానుకింద లక్ష్మీదేవి (23) ఉప్పల్‌లోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో పనిచేస్తోంది. రోజు మాదిరిగా ఈనెల 4న ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మీదేవి రాత్రైనా రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించండి

సేవాలాల్‌సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: జాతీయ రహదారి డివైడర్‌తో పాటు, పలు చోట్ల నాటిన కోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ చెట్లతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో కోనో కార్పస్ చెట్లను తొలగించాలని మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎంపీడీఓ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోనో కార్పస్ మొక్క అనేక దుష్ప్రభావాలకు కారణమవుతుందని, ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తడం జరుగుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు యాదయ్య, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి



ముదిరాజ్‌ల సంఘం మండల నూతన కార్యవర్గం

తలకొండపల్లి: ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ఆ సంఘం మాజీ మండలాధ్యక్షుడు బోళ్ల యాదగిరి డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, విద్య, ఉపాధి తదితర రంగాల్లో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ, రాజకీయాల్లో ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో మత్స్యకారుల సొసైటీలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పరంగా అందనున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏకగ్రీవ ఎన్నిక

ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడిగా పల్లెమోని సుదర్శన్, ఉపాధ్యక్షులుగా సప్పిడి మల్లేశ్, రాజమోని రవి, కార్యదర్శిగా మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా పాండు, తిరుపతి, సలహాదారులుగా యాదయ్య, పరశురాములు, కోశాధికారులుగా శివానంద్, మల్లేశ్, మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు కుమార్, బాల కిష్టయ్య, చంద్రయ్య, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం తగదు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకం వల్లే సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ హయాంలోనే సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అప్పట్లో ఆర్థిక మంత్రిగా కొనసాగిన హరీశ్‌రావు సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించకుండా ఎందుకు కాలయాపన చేశారని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైంది గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అని మండిపడ్డారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు యాటనర్సింహ, బిచ్యానాయక్, వెంకటేశ్, రాంచందర్, షాబుద్దీన్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 9న ఇబ్రహీంపట్నంలో మాల ఉద్యోగులు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈనెల 9న ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్‌లో నిర్వహించే ఈ ఆత్మీయ సమ్మేళనానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని మాల మహానాడు నేతలు కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు బండి మహేశ్, సంఘం కన్వీనర్ ఎల్.మారయ్య, సలహాదారులు బాలచందర్, మల్లేశ్‌కుమార్, కృష్ణ, రాములు, అంబేడ్కర్ సేవ సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కౌన్సిలర్ భర్తకిజగన్, నాయకులు అంగద్, లక్ష్మయ్య, పోచన్న, రవిశేఖర్, చక్రపాణి, ఉపాధ్యాయ సంఘం సభ్యులు కిరణ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హేమలత

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనను అధికారులు, సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని పురపాలక సంఘం చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్‌లు సూచించారు. మంగళవారం పుర కార్యాలయంలోని సమావేశ మందిరంలో కులగణన అంశంపై కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గణన చేపట్టే సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటా తిరిగి వివరాలను సేకరిస్తాంచాలన్నారు. ఈ గణన ద్వారా సమాజంలో వెనుకబడిన వర్గాలవారికి రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, తదితరులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన గృహాల వివరాలను పూర్తిచేయాలన్నారు. కౌన్సిలర్లు తమవార్డులో ఉన్న ప్రజలందరూ అధికారులకు సహకరించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, రాజు, భావన, లావణ్య, పద్మ, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు

లింగోజిగూడ: కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు వస్తోందని, ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. హయత్‌నగర్ డిపో-1లో మంగళవారం మేనేజర్ విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి చక్ర అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు, ఉద్యోగుల కృషి ఆర్టీసీని ప్రజలకు మరింత దగ్గర చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం డిపోలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీలో ఉన్న అన్ని రీజన్‌ల కన్నా హైదరాబాద్ రీజన్ అన్ని విభాగాల్లో ముందంజలో ఉందని దానిలో హయత్‌నగర్ డిపో మొదటి స్థానంలో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ సుచరిత, హయత్‌నగర్-2 డిపో మేనేజర్ శ్రీనివాస్ రావు, సిబ్బంది విజయ్‌కుమార్, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.